ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

మంగళవారం 29 అక్టోబరు 2024

సమగ్ర అభివృద్ధే లక్ష్యం



సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ రమేశ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు

అనకాపల్లిపై సీఎం చంద్రబాబుకు ప్రత్యేక అభిమానం

- రహదారులకు త్వరలో మరమ్మతులు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర
- ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం
- నర్సీపట్నం తాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి: స్పీకర్ అయ్యన్న
- లాజిస్టిక్ హబ్‌కు త్వరలో ప్రధాని శంకుస్థాపన: ఎంపీ రమేశ్
- ఉపాధి హామీ కింద పంట కాలువలకు లైనింగ్: మంత్రి అనిత

అనకాపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): **అనకాపల్లి జిల్లా అంటే సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక అభిమానమని, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన తరువాత తొలిసారి సోమవారం జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ సీఎం రమేశ్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.**

రహదారులు, ఇసుక, పక్కా ఇళ్లు, సీఎస్ఆర్ నిధుల వినియోగంపై చర్చించారు. అచ్యుతాపురం-అనకాపల్లి, పరవాడ-అనకాపల్లి, అగనంపూడి-అచ్యుతాపురం రోడ్లు అధ్వానంగా ఉన్నాయని పలువురు ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ రోడ్లకు త్వరలో మరమ్మతులు చేపట్టాలని, అవసరం మేరకు నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసి జాతీయ రహదారికి అనుసంధానం చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను మంత్రి రవీంద్ర ఆదేశించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి పలు సూచనలు చేశారు. సీఎస్ఆర్ నిధులు జిల్లాకు ఎక్కువ కేటాయింపు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రాభివృద్ధికి విజన్ 2027, వికసిత్ భారత్ ప్రణాళికలను అమలు చేస్తున్నామన్నారు. భారీ మెజారిటీలతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయాలన్నారు.

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, మాకవరపాలెం మండలంలో ఏర్పాటైన అల్యూమినియం ఫ్యాక్టరీ... గతంలో ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. భూమి పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించి, కాలనీలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నర్సీపట్నం మునిసిపాలిటీ ప్రజలకు తాగునీటి సరఫరాకు ఆరేళ్ల కిందట రూ.166 కోట్లతో చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని మంత్రిని కోరారు. గోదావరి నదిలో అనకాపల్లి జిల్లాకు కేటాయించిన రీచ్ నుంచి ఇసుక రవాణా జరిగేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ, జిల్లాలో లాజిస్టిక్ హబ్ ఏర్పాటు కానున్నదని, ఈ పనుల శంకుస్థాపనకు ప్రధాని నరేంద్ర మోదీ జిల్లాకు రానున్నారని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ పనులు త్వరగా పూర్తి చేసి గోదావరి జలాలను జిల్లాకు తీసుకు రావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదన చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, గామ/ వార్డు సచివాలయాల్లో ఖాళీగా వున్న పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓ పోస్టులను భర్తీ చేయాలని మంత్రి రవీంద్రను కోరారు. పాయకరావుపేటలో రూ.180 కోట్లతో చేపట్టిన భారీ మంచినీటి పథకం పనులు జాతీయ రహదారి విభాగం అధికారుల ... మిగతా 8వ పేజీలో

కూటమితోనే రాష్ట్ర ప్రగతి

- మరో 20 ఏళ్లపాటు అధికారంలో ఉండాలి
- రాష్ట్రాన్ని వైసీపీ సర్వనాశనం చేసింది
- కోడిగుడ్డు మంత్రి భూ దోపిడీపై విచారణ
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర
- కూటమి నేతలతో ఆత్మీయ సమావేశం

అనకాపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 20 ఏళ్లపాటు టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ప్రభుత్వం ఉంటేనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన తరువాత తొలిసారి సోమవారం అనకాపల్లి వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద కూటమి పార్టీల నేతలు ఘన స్వాగతం పలికారు. ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి ... మిగతా 8వ పేజీలో



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర

కార్మికులకు తీపి కబురు

అచ్యుతాపురం సెజ్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి

- నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- సెజ్‌లో భూమి పూజ చేయనున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించనున్న ప్రదేశం ఇదే

అచ్యుతాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో.. ప్రధానంగా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి, పరవాడ ఫార్మా సిటీ, ఇతర పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల వైద్య సేవలకు సంబంధించి చిరకాల డిమాండ్ నెరవేరబోతున్నది. కేంద్ర ప్రభుత్వం గతంలో మంజూరు చేసిన 30 పడకల ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటై సుమారు రెండు దశాబ్దాలు కావస్తున్నది. ఆరంభంలో ఒకటి, రెండు కంపెనీలు మాత్రమే ఏర్పాటవ్వగా, క్రమేణా పెద్ద పెద్ద కంపెనీలు, పరిశ్రమలు వచ్చాయి. వీటిల్లో వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అదే విధంగా తరచూ ప్రమాదాలు సంభవించి కార్మికులు మృత్యువాత పడడం లేదా తీవ్రంగా గాయపడడం జరుగుతోంది. ప్రభుత్వ పరంగా ఇక్కడ ప్రాథమిక ఆస్పత్రి మాత్రమే వుండడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అనకాపల్లి లేదా గాజువాక/ విశాఖ వంటి దూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి వస్తున్నది. తీవ్రంగా గాయపడిన కార్మికుల్లో పలువురికి సకాలంలో చికిత్స అందక దారిలోనే ప్రాణాలు వదులుతున్నారు. దీంతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం ఈఎస్ఐ ఆస్పత్రిని మంజూరు చేయగా, ఎస్ఈజెడ్‌లో ఏపీఐఐసీ కార్యాలయానికి పక్కన రెండు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. చుట్టూ ప్రహరీగోడ నిర్మించి, ఆస్పత్రి నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చొరవచూపలేదు. వైసీపీ హయాంలో సెజ్‌లో పలుమార్లు ప్రమాదాలు జరిగి, కొంతమంది కార్మికులు చనిపోయారు. కానీ ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం గురించి నాటి మంత్రులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎసెన్షియా కర్మాగారంలో భారీ ప్రమాదం జరిగి 17 మంది కార్మికులు మృతిచెందారు. మరి కొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరికి విశాఖ, అనకాపల్లిల్లోని ఆస్పత్రుల్లో చికిత్స చేయాల్సి వచ్చింది. ఈ విషయాలు సీఎం చంద్రబాబు దృష్టికి రావడంతో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణంపై దృష్టి సారించారు. కేంద్రంలో కూడా కూటమి ప్రభుత్వం అధికారంలో వుండడంతో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణంలో కదలిక వచ్చింది. ఆధునిక సౌకర్యాలతో ఆస్పత్రి నిర్మాణానికి రూ.69 కోట్లు మంజూరయ్యాయి. ఆస్పత్రి నిర్మాణానికి మంగళవారం ఉదయం ప్రధాని నరేంద్ర మోదీ ... మిగతా 8వ పేజీలో

మెదడులో భూకంపం



- ఆందోళనకు గురిచేస్తున్న బ్రెయిన్ స్ట్రోక్ కేసులు
- కేజీహెచ్‌లో ప్రతిరోజూ పది కేసులు నమోదు
- యుక్త వయస్కుల్లో వెలుగుచూస్తున్న సమస్య
- దురలవాట్లకు దూరంగా ఉంటేనే మేలు
- నేడు అంతర్జాతీయ బ్రెయిన్ స్ట్రోక్ డే -8లో

వేదనకు గురిచేసే సోరియాసిస్



- వ్యాధిగ్రస్తులను వేధిస్తున్న ఆత్మహత్య ఆలోచనలు, డిప్రెషన్, యాంగ్జైటీ
- నేడు సోరియాసిస్ వ్యతిరేక దినం -8లో

ప్రభుత్వ భూముల్లో ఇసుక దందా

- జంగాలపల్లిలో యథేచ్ఛగా తవ్వకాలు
- ట్రాక్టర్ ఇసుక రూ.5-6 వేలకు అమ్మకం
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు



జంగాలపల్లిలో ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను తవ్వి, ట్రాక్టర్‌లోకి లోడింగ్ చేస్తున్న కూలీలు

మాకవరపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): **మండలంలో రాజకీయంగా ప్రత్యర్థులైన టీడీపీ, వైసీపీ నాయకులు... ఇసుక అక్రమ తవ్వకాల విషయంలో మాత్రం ఒక్కటయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీను ప్రకటించి, అమలు చేస్తుండడంతో ప్రభుత్వ భూముల్లో ఇసుకను తవ్వి, దర్జాగా తరలించుకుపోతున్నారు. గత వారం రోజులుగా మండలంలోని జంగాలపల్లి గ్రామంలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. మైనింగ్, రెవెన్యూ, పోలీస శాఖల అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.**

కూటమి ప్రభుత్వం మండలంలో ఇప్పటికే సుమారు రెండు కోట్ల రూపాయల విలువ చేసే అభివృద్ధి పనులు మంజూరు చేసింది. ఇదే సమయంలో వర్షాకాలం ముగియడంతో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇటు ప్రభుత్వ అభివృద్ధి పనులకు, అటు ప్రైవేటు ఇళ్ల నిర్మాణాలకు పెద్ద మొత్తంలో ఇసుక అవసరం ఏర్పడింది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంలో కొన్ని వెసులుబాట్లు కల్పించింది. ఇవన్నీ ఇసుక అక్రమార్కులకు కలిసొచ్చాయి. జంగాలపల్లి గ్రామంలో సర్పా నదిని ఆనుకొని ఉన్న సుమారు 13 ఎకరాల ప్రభుత్వ భూమిలో భారీగా ఇసుక నిల్వలు ఉన్నాయి. కొంతమంది స్థానిక నేతలు ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తవ్వకాలు చేపట్టారు. కూలీలను ఏర్పాటు చేసుకుని ట్రాక్టర్లు, టైరు బండ్లలోకి లోడింగ్ చేయిస్తున్నారు. స్థానికంగా ట్రాక్టర్ ఇసుక రూ.2 వేలు, టైరు బండి ఇసుక రూ.800కి అమ్ముతున్నారు. ఇతర చోట్లకు రవాణా చేయాల్సి వస్తే ట్రాక్టర్ ఇసుక రూ.5-6 వేలు తీసుకుంటున్నారు. వారం రోజుల నుంచి ఇసుక తవ్వకాలు, రవాణా జోరుగా సాగుతున్నాయి. దీనిపై సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొంత రమణ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా ఇక్కడ ప్రభుత్వ భూముల్లో ఇసుక నిల్వలు ఉన్నట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు ఇంకా రాకపోవడంతో తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. కానీ ఈలోగానే ఇసుక మొత్తాన్ని అక్రమార్కులు తవ్వి, తరలించుకుపోతున్నారు. కాగా జంగాలపల్లిలో ఇసుక అక్రమ తవ్వకాలను అధికారులు ఆపాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొంత రమణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుగుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు.

ఇసుక తవ్వకాలకు వేలంపాట!

- గొట్టివాడ, చౌడువాడల్లో వైసీపీ, టీడీపీ నేతలు కుమ్మక్కు
- గొట్టివాడలో రూ.5.4 లక్షలకు వేలం
- రెండు నెలలపాటు ఇసుక తవ్వకం, అమ్మకానికి అనుమతి
- చౌడువాడలో రూ.4 లక్షలకు..



వరహా నదిలో ఈ ప్రాంతం నుంచే ఇసుక తరలించడానికి గొట్టివాడలో అనధికారికంగా వేలంపాట నిర్వహించారు

కోటవురట్ల, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): వరహా, సర్పా నదుల్లో మండలంలోని గొట్టివాడ, చౌడువాడ గ్రామ పంచాయతీల పరిధిలో అనధికారికంగా ఇసుక తవ్వకాలు, అమ్మకాల కోసం గ్రామస్థుల సమక్షంలో స్థానిక వైసీపీ, టీడీపీ నాయకులు వేలం పాటలు నిర్వహించారు. గొట్టివాడలో రెండు నెలల పాటు ఇసుక తవ్వకాలు, విక్రయాల కోసం రెండు రోజుల క్రితం అనధికారికంగా వేలం పాట నిర్వహించగా, ఓ వ్యక్తి రూ.5.4 లక్షలకు పాడుకున్నారు. చౌడువాడలో ఇసుక నిల్వలు ఒకింత తక్కువగా వుండడంతో ఇక్కడ రూ.4 లక్షలకు ఇసుక ర్యాంపును చేజిక్కించుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు, ఇతర అవసరాల నిమిత్తం నదులు, వాగుల నుంచి ... మిగతా 8వ పేజీలో

మరమ్మతులకు నోచుకోని తూటిపాల గ్రోయిన్

- నాలుగేళ్ల క్రితం సర్పా నది వరదధాటికి ధ్వంసమైన కట్టడం
- పునర్నిర్మాణానికి నిధులివ్వని నాటి ప్రభుత్వం
- 400 ఎకరాల నుంచి 130 ఎకరాలకు పడిపోయిన వరిసాగు
- ప్రస్తుతం నీరు అందక ఎండిపోతున్న వరిపైరు

వైసీపీ నిర్లక్ష్యం.. రైతులకు శాపం



తూటిపాల వద్ద ధ్వంసమైన గ్రోయిన్



నీరు లేక ఎండుతున్న వరిపైరు

మాకవరపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నింటి మాదిరిగానే వ్యవసాయ, సాగునీటి పారుదల రంగాలు కూడా గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. నాలుగు వందల ఎకరాలకు నీరందించే గ్రోయిన్ మూడేళ్ల క్రితం వరద ఉధృతికి కొట్టుకుపోగా, వైసీపీ ఒక్క ఏడాది కూడా గ్రోయిన్ పునర్నిర్మాణానికి నిధులు కేటాయించలేదు. దీంతో ఆయకట్టుకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని తూటిపాల వద్ద సర్పా నదిపై చాలా ఏళ్ల క్రితం గ్రోయిన్ నిర్మించారు. దీని కింద సుమారు 400 ఎకరాల ఆయకట్టు వుంది. గతంలో మెట్ట పంటలు వేసుకునే రైతులు.. గ్రోయిన్ నిర్మాణం తరువాత వరి పంటను సాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 2021లో భారీ వర్షాలు కురిసి, సర్పా నదికి వరద పోటెత్తడంతో తూటిపాల వద్ద గ్రోయిన్ కొట్టుకుపోయింది. ఆ ఏడాది వరి పంటకు నీరు అందలేదు. గ్రోయిన్ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయకట్టు రైతులు, ఇరిగేషన్ అధికారుల ద్వారా వైసీపీ ప్రభుత్వానికి విన్నవించారు. కానీ నాటి పాలకులు నిధులు విడుదల చేయకుండా, వినతులను బుట్టదాఖలు చేశారు. తరువాత మూడేళ్లు కూడా ఇదే పరిస్థితి. కాగా గ్రోయిన్ నుంచి పొలాలకు నీరు అందకపోవడంతో 75 శాతం మంది రైతులు వరిసాగు చేయడంలేదు. దీనికిబదులు సరుగుడు తోటలు వేసుకుంటున్నారు. ఈ ఏడాది 130 ఎకరాల్లో మాత్రమే వరి పంట వేశారు. కొద్ది రోజుల నుంచి ఎండ తీక్షణంగా కాస్తుండడంతో వరి పొలాలు నీటి ఎద్దడికి గురయ్యాయి. గ్రోయిన్ నుంచి పొలాలకు నీరు వచ్చేపరిస్థితి లేకపోవడంతో నేల నెర్రెల్చి, వరి పైరు ఎండిపోతున్నది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, గ్రోయిన్ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి శంకుస్థాపనను విజయవంతం చేయండి

» కూటమి నాయకుల పిలుపు

రాంబిల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఈజడ్‌లోని బ్రాన్‌డిక్స్ సమీపంలో ఈనెల 29వ తేదీన జరగనున్న ఈఎస్ఐ ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల కూటమి నేతలు ధూళి రంగనాయకులు బైలపూడి శ్రీరామదాసు, వి.దిన్ బాబు, పప్పల నూకన్నదొర, జనపరెడ్డి నర్సింగరావు, చిన్నారావు కోరారు. సోమవారం మండలంలోని హరిపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కూటమి నేతలలో వారు మాట్లాడారు. ఈఎస్ఐ ఆస్పత్రికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌లో శంకుస్థాపన చేస్తారన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రితో ఈ ప్రాంతాల ప్రజలు, కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని కూటమి నేతలు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రధం చేయాలని వీరు కోరారు. ఈ సమావేశంలో నేతలు ద్వారపురెడ్డి బాబ్జి, సన్యాసిరావు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

అభిజిత్ పరిశ్రమను వెంటనే తెరవాలి

» సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు



అభిజిత్ కార్మికులతో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అచ్యుతాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లోని అభిజిత్ ఫెర్రో ఎల్లాయీస్ కర్మాగారం ప్రకటించిన లేఆఫ్‌ని ఎత్తివేసి పరిశ్రమను వెంటనే తెరవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్దదర్శి జి. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కర్మాగారం ఎదుట కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా లేఆఫ్ ప్రకటించడం చట్ట విరుద్ధమన్నారు. 14 రోజుల నుంచి కర్మాగారం ఎదుట కార్మికులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం గాని, ప్రభుత్వం గాని పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొంగలి రాము, సోమునాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

వానర మూకతో ఇబ్బందులు

» కోతుల పట్టివేతకు ఆదేశించిన ఎమ్మెల్యే సుందరపు

» అయినా పట్టించుకోని మునిసిపల్ యంత్రాంగం



ఎలమంచిలిలోని కొత్తపేటలో ఇళ్ల గేట్ల వద్ద కోతుల హడావిడి

ఎలమంచిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోతలతో ప్రజలకు రోజు రోజుకూ సమస్యలు ఎదురవుతున్నాయే గానీ వీటిని పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించడం లేదు. ఇటీవల పట్టణంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పర్యటిస్తున్న సమయంలో కోతుల గుంపు ఎదురుపడింది. ఈ సందర్భంగా వీటిని తరలించే అంశంపై చర్చ సాగింది. ఈ క్రమంలో కోతులను పట్టేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని చైర్‌పర్సన్ రమాకుమారి ఎమ్మెల్యే వద్ద వాపోయారు. కోతులను పట్టించి అటవీప్రాంతాలకు తరలించే బాధ్యత మునిసిపల్ యంత్రాంగం తీసుకోవాలని కమిషనర్‌ను ఎమ్మెల్యే విజయకుమార్ ఆదేశించారు. పట్టణంలో ప్రధానంగా మిలట్రీ కాలనీ, కొత్తపేట, రామ్‌నగర్, నాగేంద్ర కాలనీ ప్రాంతాల్లో వానర మూక ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈ వీధుల్లో కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న కోతుల సమస్యకు చెక్ పెట్టాలని, లేకుండా ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంటుందని పలువురు వాపోతున్నారు. మునిసిపల్ యంత్రాంగం సత్వరం కోతులను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సింహాచలం

పాయకరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి అధ్యాపకులతోపాటు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ యు.సింహాచలం అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కళాశాలల్లో ఆధునిక సౌకర్యాలతోపాటు విద్యార్థులకు ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలుచేస్తున్నందన్నారు. విద్యార్థులు ఇంటి వద్ద చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రస్ రిపోర్టులు తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.ప్రేమ్‌కుమార్, డి.విద్యాశ్రావణి తదితరులతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో ఆయుర్వేద వైద్యం

» హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లగా మార్పు చేసిన ఆయూష్ శాఖ

» అన్ని రకాల రోగాలకు ఉచితంగా మందులు

» ఆస్పత్రి ఆవరణలోనే పలు ఔషధ మొక్కల పెంపకం

» వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రిలో పెరిగిన ఓపీ



వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి ఆవరణలో పసుపు మొక్క



ఆస్పత్రి ఆవరణలో పెరుగుతున్న దేవకాంచనం మొక్కలు

నక్కపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీర్ఘకాలిక వ్యాధులకు సైతం ఆయుష్ శాఖ ఆయుర్వేద ఆస్పత్రుల ద్వారా ఉచితంగా మందులు అందజేస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రిని హెల్త్‌అండ్‌వెల్‌నెస్ సెంటర్‌గా ఆయుష్ శాఖ మార్చింది. ఆస్పత్రి ఆవరణంతా ఆహ్లాదకరమైన వాతావరణంలో కనబడుతోంది. అనేక ఔషధ గుణాలు గల మొక్కలను ఆస్పత్రి ఆవరణలో పెంచుతున్నారు. వీటిలో మూత్ర రోగాలు, రక్తస్రావం, కిడ్నీలో రాళ్లు కరిగించే రణపాల, కామెర్లు, జ్వరం, చర్మవ్యాధులను నివారించే తిప్పతీగ, క్షయ వ్యాధిని తగ్గించేందుకు ఉపయోగించే పిల్ల పీచర, దురద, క్రిమి, కామెర్ల నివారణకు ఉపయోగపడే పసుపు మొక్కలు, వాపు, చర్మవ్యాధులు, ఆమవాతానికి ఉపయోగపడే వావిలి, క్రిమి, వాంతులు, విరేచనాలు, మధుమేహాన్ని తగ్గించే నేరేడు, చర్మవ్యాధులు, స్త్రీ రోగాన్ని అరికట్టే దేవకాంచనం సహా ఉసిరి, వేప వంటి మొక్కలను ఆస్పత్రి ఆవరణలో పెంచుతున్నారు. ఔషధ గుణాలు గల వృక్షసంపద ఆస్పత్రికి వచ్చే రోగులను కూడా ఎంతో ఉల్లాసపరుస్తుందని చెప్పాలి. గతంలో వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రిలో కనీస స్థాయిలో కూడా ఓపీ వుండేది కాదు. ప్రస్తుతం అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందులు వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రిలో లభిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజూ సగటున 25 వరకూ వుంది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రోగులు వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి సేవలను పొందాలని డాక్టర్ బినయ్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ బినయ్‌కుమార్ మాట్లాడుతూ బీపీ, షుగర్ సహా అనేక వ్యాధులను ఆయుర్వేద వైద్యం ద్వారా నయం చేసుకోవచ్చునని చెప్పారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ వుండవన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకూ ఈ సేవలు వినియోగించుకోవాలన్నారు. ఆయుర్వేద ఆస్పత్రిలో రోగులకు కావల్సిన సదుపాయాలను ఆయుష్ శాఖ కల్పిస్తుందని చెప్పారు.



వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి

వీధి దీపాల నిర్వహణ ఇష్టారాజ్యం

అచ్యుతాపురంలో పగటి పూట వెలుగుతున్న లైట్లు.. మోసయ్యపేటలో రాత్రి పూట చీకట్లు

» వీధి లైట్లు వెలగక భీతిల్లుతున్న మోసయ్యపేటవాసులు

» రెండు పంచాయతీల్లో కుక్కలు స్వైర విహారం

» చర్యలు తీసుకోని అధికారులు, పాలకులు

అచ్యుతాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్యుతాపురం, మోసయ్యపేట పంచాయతీల్లో వీధి లైట్ల నిర్వహణ భిన్నంగా ఉంది. రెండు పంచాయతీల పరిధిలో అచ్యుతాపురం మండల కేంద్రం ఉంది. అచ్యుతాపురం జంక్షన్‌గా పేరుగాంచిన నాలుగు రోడ్ల కూడలి, పూడిమడక రోడ్డులోని రామాలయం వరకు మోసయ్యపేట పంచాయతీ పరిధిలోనే ఉంది. మండల కాంప్లెక్స్‌తోపాటు విద్యుత్ ఉప కేంద్రం, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాలు అచ్యుతాపురం పంచాయతీ పరిధిలో ఉన్నాయి.

అచ్యుతాపురం పంచాయతీ పరిధి చాలా తక్కువ.. ఈ పంచాయతీలోని వీధుల్లో గల వీధి దీపాలు రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగుతూనే ఉంటున్నాయి. పట్టపగలు వీధి దీపాలు వెలుగుతున్నా పట్టించుకొనే నాథులే లేరు. ఇక, మోసయ్యపేట పంచాయతీ విస్తీర్ణం తక్కువ.. గృహాలు ఎక్కువ.. దీనివల్ల రోడ్లు ఇరుకుగా ఉంటాయి. ఇక్కడి ప్రజలు రాత్రి వేళ బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఎందుకంటే పంచాయతీ పరిధిలో ఒక్క వీధి లైటు కూడా వెలగడం లేదు. ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా ఇటు పంచాయతీ అధికారులు గాని, అటు ఈపీడీసీఎల్ అధికారులు గాని పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. పంచాయతీ పరిధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గ్రామంలో గుంపులుగా కుక్కలు సంచరిస్తూ గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇళ్ల మధ్య రోడ్డుపై కుక్కలు పడుకుంటున్నాయి. వీధి లైట్లు లేకపోవడంతో చీకట్లో ఏ కుక్క మీద పొరపాటున కాలేస్తే బొడ్డు చుట్టూ ఇంజక్షన్లు వేయాల్సిందేనని గ్రామస్థులు భయపడుతున్నారు. పాఠశాల విడిచిన తర్వాత ఇళ్లకు వస్తున్న విద్యార్థులను కుక్కలు భయపెడుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో వీధిలైట్లు ఏర్పాటుచేయడంతోపాటు కుక్కల నివారణకు చర్యలు తీసకోవాలని కోరుతున్నారు.



అచ్యుతాపురంలో పగటి పూట వెలుగుతున్న విద్యుత్ దీపాలు



మోసయ్యపేటలో వీధి సింహాలు

ఆర్మీ ఉద్యోగికి కన్నీటి వీడ్కోలు

» అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

» అధిక సంఖ్యలో హాజరైన ఆర్మీ ఉద్యోగులు

» మామిడివాడ కొత్తూరులో విషాద ఛాయలు

రాంబిల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అస్వస్థతకు గురై మృతి చెందిన ఆర్మీ ఉద్యోగి పప్పల చిరంజీవి (38)కి స్వగ్రామమైన మామిడివాడ కొత్తూరులో సోమవారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. బెంగళూరు ఆర్మీయూనిట్‌లో హవల్దార్‌గా పనిచేస్తున్న చిరంజీవికి ఈనెల 22న విధి నిర్వహణలో ఉండగా అస్వస్థతకు గురవ్వడంతో అధికారులు కమాండో ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 26న మృతి చెందారు. చిరంజీవి మృతదేహాన్ని ఆర్మీ అధికారులు సోమవారం అంబులెన్స్‌లో కొత్తూరుకు భారీ ఊరేగింపుతో తీసుకువచ్చారు. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిరంజీవి మృతదేహంపై జాతీయ జెండా ఉంచి, సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈయనకు భార్య పప్పల మాధురి, కుమార్తె సమీరా, కుమారుడు దుర్గా ఫణిలోకిత్, తండ్రి ఈశ్వరరావు, తల్లి చినమ్మలు, సోదరుడు రాజేష్ ఉన్నారు.



అంత్యక్రియలకు అధిక సంఖ్యలో తరలి వచ్చిన జనం. ఇన్‌సెట్‌లో చిరంజీవి

విశేష సేవలందించిన చిరంజీవి

రాంబిల్లి మండలం మామిడివాడ కొత్తూరుకు చెందిన పప్పల చిరంజీవి 2004 డిసెంబరు 8న ఆగ్రాలో ఆర్మీలో సైనికుడిగా చేరారు. 2008 డిసెంబరు 18 నుంచి పేరా కమాండోగా సేవలు అందించారు. 2015 నుంచి 2019 వరకు లెఫ్టెన్ పేరా స్పెషల్ ఫోర్స్‌లో పనిచేశారు. ప్రస్తుతం ఆయన బెంగళూరులో 515 ఆర్మీ బేస్ వర్కుషాపులో కమాండో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



చిరంజీవి మృతదేహంపై జాతీయ జెండాను ఉంచి నివాళులర్పిస్తున్న ఆర్మీ ఉద్యోగులు



చిరంజీవి చివరిరోజు వేసుకున్న యూనిఫామ్, ఆయనపై ఉంచిన నేషనల్ ఫ్లాగ్‌ను కుటుంబీకులకు అందజేసిన ఆర్మీ ఉద్యోగులు

నేడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

ఎలమంచిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చించడం జరుగుతుందని, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

పాఠశాలలు, కాలేజీల సమయాల్లో ఆర్టీసీ అదనపు సర్వీసులు నడపాలి

పాయకరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో స్కూళ్లు, కాలేజీలకు విద్యార్థులు రాకపోకల వేళల్లో ఆర్టీసీ అదనపు బస్సులను నడపాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె.అర్జున్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులు ఉదయం స్కూళ్లకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇళ్లకు వచ్చే సమయంలో ప్రయాణికులతో నిండిపోయిన ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణాలు చేసేందుకు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. విద్యార్థినుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని వాపోయారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి పట్టణంలో ఆర్టీసీ అదనంగా ప్రత్యేక సర్వీసులు నడపాలని, లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఉపాధ్యాయులకు సూచనలు

అచ్యుతాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు సీకే దేవరాయలు, రజనీ దేవి మండలంలోని ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటుచేశారు. విద్యార్థుల అపార నమోదుతోపాటు యూడైస్ ప్రక్రియ గురించి దిశానిర్దేశం చేశారు.

రహదారి భద్రతపై అవగాహనా ర్యాలీ



మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం వెలుగు కార్యాలయం నుంచి సంతబయలు హైవే జంక్షన్ వరకూ రహదారి భద్రతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. బైక్‌లు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం చేయరాదంటూ నినాదాలు చేశారు. అనంతరం మానవహారం చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీ శ్రీనివాస్, ఏపీఎం కె.శ్రీనివాసరావు, సీసీలు రాజు, సన్యాసిరావు, అప్పారావు, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నక్కపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి రోజూ శానిటేషన్ పనులను చేపట్టాలని ఎంపీడీవో డి.సీతారామరాజు కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. సంపద కేంద్రాల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఒకటో తేదీనే నూరుశాతం లబ్ధిదారులకు అందించాల్సి వుందన్నారు. ఉచిత ఇసుక గురించి హెచ్‌డీటీ అన్నాజీరావు వివరించారు.

మంత్రి రవీంద్రను కలిసిన సుందరపు



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తోపాటు పూడిమడక మత్స్యకార నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే విజయకుమార్ విశాఖపట్నం విమానాశ్రయంలో రవీంద్రకు శాలువ కప్పి స్వాగతం పలికారు. తదనంతరం పూడిమడక మత్స్యకార నాయకులు అనకాపల్లిలో పూలమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేరుగు బాపునాయుడు, దోని కాసుబాబు, మేరుగు వెంకటరావు, చోడిపల్లి మహేష్, నర్సింగరావు, మేరుగు మహేష్, ఉమ్మిడి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో పెదగుమ్ములూరు 11 కేవీ, గోకులపాడు ఫీడర్‌లో ఉన్న భీమవరం, పెదగుమ్ములూరుల్లో విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల్లో భాగంగా సరఫరా నిలిపివేయడం జరగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

» ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పాయకరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో గుర్తించిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో గత వారంలో పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన అభివృద్ధి, నిర్వహణ కార్యక్రమాలపై ఎంపీడీఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించే పనులు, తాగునీటి వనరుల నిర్వహణను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇంటి పన్నుల వసూలు తదితర పంచాయతీ ఆదాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, ఏఓ సీహెచ్.రవికుమార్‌వర్మ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణం ప్రాణసంకటం

ప్రమాదకరంగా దార్లపూడి రహదారి

» నిత్యం ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

» 35 ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు

» తర్వాత కన్నెత్తి చూడని ప్రభుత్వాలు

ఎస్.రాయవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి ఆర్అండ్‌బీ రోడ్డు ప్రయాణికులు, వాహనదారులను భయపెడుతోంది. ఈ రోడ్డులో ప్రయాణం చేయడమంటే ప్రాణగండమే వాహనదారులు బెంబేలు చెందుతున్నారు. గ్రామం నుంచి అడ్డరోడ్డు, నర్సీపట్నం ఆర్అండ్‌బీ రోడ్డు ప్రధాన జంక్షన్ వరకు పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డును 35 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా మరమ్మతులు చేయలేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. భయంకరమైన గోతుల్లో పడి పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సాధారణ రోజుల్లో ప్రయాణం చేయడమే కష్టమనుకుంటే వర్షాకాలంలో గోతులన్నీ వర్షపు నీటితో నిండి ఎక్కడ గొయ్యి ఉందో తెలియక నరకయాతన పడుతున్నామని ఆటోవాలాలు ఆందోళన వెలిబుచ్చారు. ప్రధానంగా రోడ్డు దెబ్బతిని ఎన్నో ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం ఏమిటని గ్రామస్థులు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం స్పందించి దార్లపూడి రోడ్డుపై తారు వేయాలని కోరుతున్నారు.



దార్లపూడిలో రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడిన దృశ్యం



దార్లపూడిలో రోడ్డుపై పెద్ద గోతులు ఏర్పడిన దృశ్యం

బిక్కుబిక్కుమంటూ ఆటో నడుపుతున్నాం

దార్లపూడి రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నాం. ఆటో ఎక్కిన ప్రయాణికులు కూడా భయపడుతున్నారు. రోడ్డు దెబ్బతిని చాలా ఏళ్లు అయినా ఎప్పుడూ మరమ్మతులు చేయలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి నూతన రోడ్డును నిర్మించాలి.

-అప్పారావు, ఆటో డ్రైవర్

వార్డుల్లో ఆక్రమణలు ఆపండి

ప్రజా సమస్య పరిష్కార వేదికకు పలు సమస్యలపై 13 వినతులు

తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆర్డీవో రమణ ఆదేశాలు



ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఆర్డీవో

నర్సీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ఆక్రమణలు ఆపాలని స్థానిక ప్రజలు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో వీవీ రమణ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి ప్రజల వినతి పత్రాలు స్వీకరించారు. పెదబొడ్డేపల్లి పదో వార్డు బ్రాహ్మణవీధిలో రోడ్డు ఆక్రమణ ఆపాలని స్థానికులు రెడ్డి సత్యవతి, పినగాడి వరలక్ష్మి తదితరులు ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. మునిసిపాలిటీ పరిధిలోని లింగాపురం గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మాణం కోసం సర్వే నంబరు 288లోని 60 సెంట్లు జిరాయితీ భూమిని తీసుకున్నారని, సదురు భూమికి నష్ట పరిహారం ఇప్పించాలని బలిఘట్టం గ్రామానికి చెందిన శెట్టి శేఖర్ ఫిర్యాదు చేశారు. తన జిరాతీ భూమి 60 సెట్లు నర్సీపట్నం మండలం చెట్టుపల్లికి చెందిన బంగారు రత్నం ఫించను ఇప్పించాలని అర్జీ పెట్టుకుంది. ఇంటిని ఆనుకొని పంట కాలువ నీరు ప్రవహించడం వల్ల గోడలు నానిపోతున్నాయని, సమస్య పరిష్కరించాలని శారదానగర్‌కు చెందిన కురచ రత్నం విన్నవించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 13 వినతిపత్రాలు అందినట్టు అధికారులు తెలిపారు. వీటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆర్డీవో వీవీ రమణ ఆదేశాలు జారీ చేశారు.

బాలల ప్రతిభా పాటవ పోటీలు అభినందనీయం



జిల్లా స్థాయి బాలల ప్రతిభా పాటవ పోటీలు ప్రారంభిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా స్థాయి బాలల ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఆర్డీవో వీవీ రమణ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను, ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు పెట్టి బహుమతులతో ప్రోత్సహించడం చాలా మంచి కార్యక్రమం అన్నారు. చిన్నతనంలోనే తాను కూడా ఇటువంటి పోటీలలో పాల్గొనడం వల్ల ఈ స్థాయికి వచ్చానని ఆర్డీవో గుర్తు చేశారు. విద్యార్థులు చదువుతో ఇటువంటి పోటీలలో పాల్గొనడం చాలా అవసరమన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

సోమవారం ఉదయం జరిగిన చిత్రలేఖనం పోటీలో జిల్లాలో వివిధ మండలాల నుంచి 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. జూనియర్, సీనియర్ విభాగాలలో ఈ పోటీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం జూనియర్స్ బృందగానం పోటీలు జరుగుతాయని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడిగర్ల వరహాలనాయుడు, కేవీ రమణ, ఎ రమణమూర్తి, డీవీఆర్ మూర్తి, వానపల్లి శ్రీనివాసరావు, బాబీ మాస్టారు, జీవీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల ఆందోళనకు జనసేన మద్దతు

పాల ధర తగ్గింపుపై పోరాడతాం

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు



చోడవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాల సేకరణ ధర తగ్గిస్తూ విశాఖ డెయిరీ పాలకవర్గం తీసుకున్న నిర్ణయం తక్షణమే వెనక్కి తీసుకోవాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాడి పశువుల పోషణ భారంగా మారి, పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పాడి రైతులను ఆదుకోవాల్సిన డెయిరీ యాజమాన్యం, వారిని మరింత నష్టాల పాలయ్యేలా నిర్ణయాలు తీసుకోవడం అన్యాయమన్నారు. విశాఖ డెయిరీ అభివృద్ధిలో పాడి రైతుల పాత్ర అణువణువునా ఉందని, పాడి రైతులకు గతంలో ఇచ్చిన ప్రయోజనాలను కూడా యాజమాన్యం తగ్గించి వేస్తుండడం ఆందోళనకరంగా ఉందని ఆయన వాపోయారు. విశాఖ డెయిరీ అభివృద్ధికి వెన్నుదన్నుగా నిలిచిన పాడి రైతులను నష్టాలపాలు చేసే నిర్ణయాలు తీసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. వారికి న్యాయం జరిగేంత వరకూ రైతులకు అండదండగా నిలుస్తామని, వారి తరపున పోరాడతామని ఈ సందర్భంగా రాజు స్పష్టం చేశారు.

కొల్లు రవీంద్రకు టీడీపీ నేతల సత్కారం



మంత్రి కొల్లు రవీంద్రను సన్మానిస్తున్న మండల టీడీపీ నాయకులు

దేవరాపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, పలువురు నాయకులు సోమవారం సత్కరించారు. అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వచ్చిన రవీంద్రను పార్టీ శ్రేణులు పోతల పాత్రునాయుడు, చల్లా నానాజీ, తమదాన ప్రసాద్, బాబూరావు తదితరులతో సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏపీ స్టేట్ యోగా అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సతీష్



చోడవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యోగా అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ప్రముఖ యోగా గురువు పుల్లేటి సతీష్ నియమితులయ్యారు. గ్రామీణ ప్రాంతంలో ఉచితంగా యోగాకు ప్రాచుర్యం కల్పిస్తూ, పతంజలి యోగా కేంద్రం ద్వారా ఎంతో మంది క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపించి విజేతలను తయారు చేస్తున్న సతీష్ సేవలను గుర్తించిన అసోసియేషన్ ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ నిర్ణయంపై పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. తనకు రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందని, రాష్ట్రంలో యోగా క్రీడకు మరింత ప్రాచుర్యం తీసుకురావడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా సతీష్ పేర్కొన్నారు.

ఘనంగా కౌన్సిలర్ రాజేశ్ జన్మదినం



రాజేశ్‌కు కేక్ తినిపిస్తున్న పద్మావతి

నర్సీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ 25వ వార్డు కౌన్సిలర్, స్పీకర్ చిన్న కుమారుడు చింతకాయల రాజేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. రాజేశ్ సోదరుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, తల్లి చింతకాయల పద్మావతి, భార్య దివ్యశ్రీ సోమవారం కేక్ కట్ చేశారు. టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పుష్ప గుచ్ఛాలు అందజేసి రాజేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు.

ఇసుక దోపిడీపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గబ్బాడ ఇసుక దోపిడీపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ సోమవారం అనకాపల్లిలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కి ఫిర్యాదు చేశారు. ఈ నెల 25వ తేదీ రాత్రి గబ్బాడ డిపోలో రెండు టిప్పర్ లారీలు అనధికారికంగా ఇసుక లోడింగ్ చేసినట్టు తెలిపారు. లారీ డ్రైవర్ వద్ద బుకింగ్ రసీదు లేదని వివరించారు. ఈ ఘటనపై 26వ తేదీన రూరల్ సీఐకి ఫిర్యాదు చేయగా, అక్కడ ఏమీ జరగలేదని సీఐ చెప్పడం దారుణమన్నారు. లారీలు, రికార్డులను తనిఖీ చేయకుండా ఇసుక డిపో నుంచి లారీలను పంపించేశారని ఆయన ఆరోపించారు. ఇసుక అక్రమంగా తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేదంటే హైకోర్టులో కేసు వేస్తామని గణేశ్ స్పష్టం చేశారు.

పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



అర్జీదారుని సమస్యను ఆలకిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్



ఎస్పీ తుహిన్ సిన్హాకు తన సమస్య చెప్పుకుంటున్న వృద్ధుడు

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారితో స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారు లను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజల సమస్యలు తమ సమస్యలుగా భావించి త్వరగా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కాగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 243 అర్జీలు అందినట్టు కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్‌ఓ దయానిధి, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ

అనకాపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి గోడును ఆలకించారు. మొత్తం 35 అర్జీలు అందగా వాటిని సంబంధిత పోలీసు స్టేషన్లకు బదిలీ చేశారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల వినతులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు పాల్గొన్నారు.

విరివిగా పశుగ్రాసం సాగుచేయాలి

పశు సంవర్ధక శాఖ ఏఈడీ చిట్టినాయుడు

మాడుగుల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులు తమ ఆదాయాన్ని రెట్టింపు చేసుకునేందుకు విరివిగా పశుగ్రాసం సాగు చేయాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ వి.చిట్టినాయుడు సూచించారు. మండలంలో కేజే పురం గ్రామంలో సోమవారం రాత్రి పాడి రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు పూర్తిస్థాయిలో మేత అందించే విధంగా పశుగ్రాసం అధికంగా సాగు చేయాలని సూచించారు. అలాగే పశువులు ఈతకు ఈతకు ఎడబాటు ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు.

పాలసీలపై జీఎస్టీ రద్దు చేయండి

నర్సీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాలసీలపై జీఎస్టీ రద్దు చేసి బోనస్ పెంచాలని కోరుతూ ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సోమవారం ఏజెంట్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, కనీసం రూ.లక్ష బీమాతో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్ల వరకు పాలసీ ఇవ్వాలని, పాలసీదారులకు లోన్‌పై వడ్డీ తగ్గించాలని, ఏజెంట్లకు గ్రూప్ ఇన్సూరెన్సు రూ.25 లక్షలకు పెంచాలని నినదించారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా నర్సీపట్నం బ్రాంచ్ పరిధిలో గల అధిక సంఖ్యలో ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గంటా శ్రీనివాసరావు, కార్యదర్శి కోరాకుల శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోనాం జలాశయంలో తుప్పల తొలగింపు

చీడికాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులు ఆనందంగా గడిపేందుకే కోనాం జలాశయం వద్ద తుప్పలు తొలగిస్తున్నట్టు నీటి పారుదల శాఖ ఏఈఈ సిహెచ్.జయరాంపడాల్ తెలిపారు. సోమవారం ఉదయం నుంచి కోనాం జలాశయం చుట్టూ ఉన్న తుప్పలను వ్యవసాయ కార్మికులతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో జలాశయం చుట్టూ తుప్పలు పేరుకుపోతున్నాయని, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వీటిని తొలగిస్తున్నామని చెప్పారు. కార్తీకమాసం ప్రారంభం నుంచి పర్యాటకులు జలాశయం వద్దకు వచ్చి ఆనందంగా గడిపేందుకు కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో నైట్ వాచ్‌మన్ షేక్ రసూల్ పాల్గొన్నారు.

విద్యా/వసతి దీవెన బకాయిలపై ఆందోళన

చోడవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం విద్యార్థులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది విద్యార్థులకు భారంగా మారిందని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థుల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అర్జున్ పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

చీడికాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీవో హేమసుందర్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్దేశిత సమయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ సచివాలయంలో ఉండాలన్నారు. ఆయా సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ వెళ్లి తనిఖీలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో బాల్య వివాహాలను నివారించాలన్నారు. వచ్చే నెల 1న పింఛన్ పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలి

దేవరాపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి సర్వే నంబరు 259/2లో 27.56 ఎకరాల గ్రామ కంఠం భూములకు రక్షణ కల్పించాలని జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కేవీ.రమణ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ కంఠం భూములను గుర్తించి బోర్డులు పెట్టాలని, కోరారు. సహకార సంఘం మాజీ డైరెక్టర్ సన్యాసిరావు, వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సింహాచలంనాయుడు, సభ్యులు సంతోష్, చొక్కాకుల రమణ, శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మ పీడీ ఆశాదేవి

విత్తనోత్పత్తిపై అవగాహన పెంచుకోండి

ఆత్మ ప్రాజెక్టు ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి

మాకవరపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విత్తనోత్పత్తిపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఆత్మ ప్రాజెక్టు ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) ఆశాదేవి అన్నారు. తామరం సచివాలయంలో మాకవరపాలెం, కోటవురట్ల, నక్కపల్లి విత్తనోత్పత్తిదారులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడీఆర్, డీఆర్‌సీ పరిధిలో విత్తనోత్పత్తి ప్రాముఖ్యతపై రైతులకు పలు సూచనలు ఇచ్చారు. విత్తన రకాలు, అంకురోత్పత్తి శాతం, వ్యవసాయ పద్ధతులు, కేళీలు గుర్తించడంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఏవో చిరంజీవి పాల్గొన్నారు.

డి.పట్టా భూముల విక్రయాలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

మాడుగుల రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని గిరిజనులు సాగు చేసుకుంటున్న డి.పట్టా భూములపై విక్రయాలపై చర్యలు తీసుకోవాలని గిరిజనులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు రమాదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. లోవపొన్నవోలులో సుమారు 70 ఏళ్ల నుంచి గిరిజనులు సాగు చేసుకుంటున్న డి.పట్టా భూములను దళారులు, గిరిజనులకు కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాయ మాటలు చెప్పి క్రయవిక్రయాలు చేస్తున్నారని, వారి నుంచి ఈ భూములకు రక్షణ కల్పించాలని విన్నవించారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హామీ ఇచ్చినట్టు గిరిజనులు ఓంద్రు అప్పారావు, కె.అర్జున, రాము, చినబ్బాయి, అప్పారావు తెలిపారు.

సమస్యలపై పోరాడతాం: సీపీఎం నేత లోకనాథం



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

నర్సీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడతామని సీపీఎం జిల్లా నాయకుడు లోకనాథం చెప్పారు. నర్సీపట్నంలో సోమవారం నిర్వహించిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలు, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు. ఈ సమస్యలపై వచ్చే నెల 8 నుంచి 15 వరకు నిరసన కార్యక్రమాలను చేపడతామన్నారు. నాయకులు రుత్తల శంకరరావు, సూర్యప్రభ. అడిగర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు ఉత్సవం



వైబీ పట్నంలో గంధాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న ముస్లింలు

నాతవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైబీ పట్నం గ్రామంలో ఉసురు ఉత్సవాన్ని ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవానికి చుట్టు పక్కల గ్రామాల్లోని ముస్లింలతో పాటు హైదరాబాద్ నుంచి హపీజ్ దీదరుల్ల, మచిలీపట్నం నుంచి ఎయహసన్ రాజా తౌసీఫి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ముస్లిం సోదరులు ఊరేగింపుగా మసీదుకు గంధాన్ని తీసుకు వెళ్లారు. అలాగే సాయంకాలం విందు బోజనాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నర్సీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. సోమవారం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేసి కమిషనర్ సురేంద్రకు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.28 వేలు అమలు చేయాలని కోరారు. జనాభాకు తగ్గట్టు కార్మికుల సంఖ్య పెంచాలని, హెల్త్ కార్డులు, పని సామగ్రి అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

'దళితుల భూముల్లో బడాబాబులు పాగా'

గొలుగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దళితులకు చెందిన భూముల్లో బడాబాబులు పాగా వేశారని నర్సీపట్నం డివిజన్ ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ సభ్యుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిట్ల చలపతిరావు ఆరోపించారు. గొలుగొండలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని జమ్మవరం రెవెన్యూ గ్రామంలో 59 సర్వే నంబరులో సుమారు ఆరు ఎకరాల్లో దళిత కుటుంబం మంగళగిరి లోవరాజుకు చెందిన తాతల నుంచి సాగు చేసుకుని జీడిమామిడితోటలో ఫలసాయం పొందుతున్నారన్నారు. ఐదేళ్ల క్రితం ఈ భూమిపై కన్నేసిన నర్సీపట్నానికి చెందిన కొంత మంది వ్యక్తులు తమపై దాడులు నిర్వహిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. దీనిపై అధికారులు పూర్తి స్థాయిలో రికార్డులు పరిశీలించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు సరమండ వీరబాబు, బుంగా మాణిక్యం, బాధిత రైతు లోవరాజు పాల్గొన్నారు.

పాల సేకరణ ధరలు పెంచాలి

కె.కోటపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ తగ్గించిన పాల సేకరణ ధరను వెంటనే పెంచాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శంకర్, గండి నాయనబాబు, యర్రా దేముడు డిమాండ్ చేశారు. ఇందుకోసం ఈ నెల 29న విశాఖ డెయిరీ వద్ద చేపట్టనున్న మహా ధర్నా పోస్టర్‌ను కె.కోటపాడులో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాల రైతులు చేస్తున్న పోరాటానికి సీపీఎం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. పశు పోషణ వ్యయం విపరీతంగా పెరిగినప్పటికీ విశాఖ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరలు పెంచకుండా ధరలను తగ్గించడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం డెయిరీ ఇస్తున్న ధర ఏమాత్రం గిట్టుబాటుగా లేదని పేర్కొన్నారు. కనీసం ఆవు పాలకు లీటరుకు రూ.50, గేదె పాలకు రూ.100 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29న గాజువాక డెయిరీ వద్ద మూడు జిల్లాల రైతులతో చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు రామలక్ష్మి, వి.సూర్యనారాయణ, గాడి ప్రసాద్ పాల్గొన్నారు.

సిస్టర్ నివేదిత జయంతి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వడ్డాదిలో సోమవారం సిస్టర్ నివేదిత జయంతిని అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి అరిపాక కామేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు సరైన విద్యావకాశాలు కల్పించి విద్యావంతులను చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని సిస్టర్ నివేదిత చెప్పారన్నారు. ఈ సందర్భంగా పేదలకు పండ్లు, రొట్టెలు, విద్యార్థినులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

కుసర్లపూడిలో శుభదిన్ భోజన్

రోలుగుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుసర్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుడు అప్పన రాంబాబు విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు సమకూర్చారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్‌రావు పాల్గొన్నారు.

గంజాయిలో ఇద్దరి అరెస్టు

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గబ్బాడ గ్రామం వద్ద సోమవారం రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై రెండు కిలోల గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. అచ్యుతాపురం మండలానికి చెందిన ద్వార పూడి లోకేష్, పరవాడ మండలానికి చెందిన వడిసల దుర్గారావులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు చెప్పారు. అలాగే నార్కోటిక్ డాగ్‌స్కాడ్‌తో డౌనూరు చెక్‌పోస్టువద్ద వాహనాలను తనిఖీ చేశారు.

మోదకొండమ్మ ఆలయంలో చోరీ

బుచ్చెయ్యపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయరామరాజుపేట మోదకొండమ్మ దేవాలయంలో ఆదివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం భక్తులు గుడికి వెళ్లి చూసేసరికి గుడి తలుపులు తెరిచి ఉన్నాయి. అమ్మవారికి చెందిన బంగారం, వెండి ఆభరణాలతో పాటు హుండీ పగలగొట్టి నగదు కాజేశారని భక్తులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ భాస్కరరావు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఆయన తెలిపారు.

చిత్తులాటపై దాడి

ఐదుగురిపై కేసు

గొలుగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిత్తులాటపై దాడులు నిర్వహించి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. కశిమి గ్రామ పంచాయతీ పరిధిలోని జీడిమామిడి తోటల్లో చిత్తులాట ఆడుతున్నట్టు అందిన సమాచారంతో దాడులు నిర్వహించినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. రూ.11250 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వీహెచ్‌పీ కమిటీ సమావేశం

మాడుగుల రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో కేజే పురం జంక్షన్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం విశ్వ హిందూ పరిషత్ మండల కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే నెల 9 నుంచి 15వ తేదీ వరకు గోపాష్టమి జరిపించాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు రాపేటి రామకొండారావు, సభ్యులు చిరంజీవినాయుడు పాల్గొన్నారు.

పీవో చొరవతో 23 గ్రామాల గిరిజనులకు ఉపాధి పనులు



రాష్ట్ర ప్రభుత్వం, పీవో అభిషేక్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పీవో చొరవతో 23గ్రామాల గిరిజనులకు ఉపాధి పనులు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం ఉపాధి హామీ పథకం అధికారులు ఆదివాసీలకు ఉపాధి పనులు కల్పించారు. జీకేవీధి పంచాయతీ పరిధిలోని 23 గ్రామాల గిరిజనులకు మూడేళ్లుగా సాంకేతిక సమస్య కారణంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు ఉపాధి పనులు కల్పించడం లేదు. దీంతో ఆదివాసీలు పొరుగు గ్రామాలకు వెళ్లి కూలి పనులు చేసుకోవాల్సి వస్తున్నది. పలుమార్లు వైసీపీ ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నప్పటికి ఫలితం లేకపోయింది. ఈనెల 18 తేదీన పాడేరులో జరిగిన మీకోసం కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌కి ఆ గ్రామ గిరిజనులు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పీవో రాష్ట్ర అధికారులతో మాట్లాడి సాంకేతిక సమస్యను పరిష్కరించారు. స్థానిక కూటమి నాయుడు ముక్కలి మహేశ్, గిరిజనులు బుజ్జిబాబు, కిల్లో రాంబాబు, కొర్ర రాంబాబు, రామన్న, మల్లేశ్, రాములమ్మ రాష్ట్ర ప్రభుత్వానికి, ఐటీడీఏ పీవోకి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడిని నియమించండి

▸▸ డీఈవోకు జోడూరు గ్రామస్థులు వినతి



డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న జోడూరు ప్రజలు

పాడేరు రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మా గ్రామంలోని పాఠశాలకు ఉపాధ్యాయుడును నియమించాలంటూ వంట్లమామిడి పంచాయతీ జోడూరు గ్రామస్థులు, గిరిజన సంఘం జిల్లా నాయకుడు పాలికి లక్కు సోమవారం డీఈవో, ఎంఈవో కార్యాలయాల్లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లక్కు మాట్లాడుతూ.. జోడూరు పాఠశాలకు ఈనెల 17వ తేదీన ఉపాధ్యాయుడిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. నేటికి పది రోజులు గడిచినప్పటికి గ్రామానికి ఉపాధ్యాయుడు రావడం లేదన్నారు. ఒంటిపాక పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడును ఈ విషయమై జోడూరు గ్రామస్థులు ప్రశ్నించడంతో నేను మీ గ్రామానికి రానంటూ దురుసుగా సమాధానం చెప్పారన్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయుడిని నియమించి విద్యకు దూరమవుతున్న తమ చిన్నారులకు విద్యా బోధన చేయించాలని ఆయన కోరారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జోడూరు గ్రామస్థులు బాబూరావు, రాజు, రవికుమార్, కోమటిరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు సరిహద్దుల పరిశీలన

▸▸ వివరాలు సేకరించిన సబ్ కలెక్టర్



రహదారి విస్తరణ పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

అనంతగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ పర్యటించారు. అనంతగిరి మీదుగా బొడ్డవర వరకు జరిగే జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధించి సరిహద్దులను పరిశీలించారు. రోడ్డు విస్తరణలో ఎంత మేరకు ప్రభుత్వ భూములు, జిరాయితీ భూములు, ఇళ్లు ఉన్నాయి అనే దానిపై క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా భీసుపురం నుంచి కరకవలస వరకు రోడ్డును ఆనుకుని ఇరువైపులా ఉన్న ఇళ్లను, భూములను పరిశీలించి వాటిపై ఆరా తీశారు. రైతులకు సంబంధించిన భూములపై స్పష్టతగా ఉండాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్టం లేకుండా పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మాణిక్యం, రీసర్వే డీటీ రామ్మూర్తి, ఆర్ఐ శంకరరావు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వనసపల్లి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

సీలేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలో అధిక వర్షాలకు అధ్వానంగా తయారైన కొత్తూరు-వలసపల్లి రహదారికి మరమ్మతులు చేయాలని స్థానిక గిరిజనులు విజ్ఞప్తి చేశారు. సోమవారం వలసపల్లి, మునసపల్లి గ్రామాల ఆదివాసీలు విలేకరులతో మాట్లాడుతూ గత నెల 8వ తేదీన కురిసిన భారీ వర్షాలకు వలసగడ్డ కొత్తూరు నుంచి వలసపల్లి వరకు నాలుగు కిలోమీటర్లు రహదారి అత్యంత అధ్వానంగా తయారైందన్నారు. పలు చోట్ల రహదారి కోతకు గురైందని, రోడ్డుపై బండరాళ్లు, వృక్షశకలాలు కొట్టుకువచ్చాయన్నారు. తక్షణమే ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని స్థానిక గిరిజనులు కోరాడు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ మంగరాజు, గ్రామ పెద్ద చల్లంగి బరామ్ పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

సీలేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారులందరికి వ్యాధి నిరోధక టీకాలు వేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి(హెచ్‌ఈవో) కె.జోజిబాబు తెలిపారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలో హెడ్ కౌంట్ సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఈవో మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఏ స్థాయిలో అందాయని సర్వే చేస్తున్నామన్నారు. టీకాలు అందని చిన్నారులను గుర్తించి మరోసారి వేయించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్. త్రినాథరావు పాల్గొన్నారు.

ఉల్లాస్ ద్వారా పెద్దల విద్య : ఎంపీడీవో

గూడెంకొత్తవీధి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులైన పెద్దలకు ఉల్లాస్ పథకం ద్వారా విద్యను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ పథకంపై సచివాలయం ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉల్లాస్ పథకంలో నిరక్షరాస్యులైన వాచ్‌మన్, కుక్, అటెండర్, ఇతర కింది స్థాయి ఉద్యోగులు, డ్వాక్రా సభ్యులకు విద్యాబోధన అందించడం జరుగుతుందన్నారు. పది మందికి ఒక వలంటీర్‌గా వీవోఏను నియమించడం జరుగుతుందన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రక్షిత నీటి పథకాలను శుభ్రంచేసి క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా

డుంబ్రిగుడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు టిసుబ్బారావు అన్నారు. సాగర పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ తౌడమ్మ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు జరిగింది. కార్యక్రమంలో నియోజకవర్గ సభ్యత్వ సమన్వయ కర్త రాజ్‌కుమార్ కామరాజు, యూనిట్ ఇన్‌చార్జి కమాలకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు త్వరితగతిన అటవీ అనుమతులు

▸▸ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్. పక్కన జేసీ అభిషేక్‌గౌడ్, డీఆర్‌వో పద్మావతి

పాడేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు త్వరితగతిన అటవీ శాఖ అనుమతులు లభించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. అటవీ అనుమతులపై కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు రోడ్లు, సెల్ టవర్లు, ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ల నిర్మాణాలకు అటవీ అనుమతులు ఇచ్చేందుకు అటవీ, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రాంతాల్లో రోడ్లు, సెల్ టవర్లు, ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ల నిర్మాణానికి ఈసమావేశంలో అనుమతులు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పెదబయలు మండలం ఎగువ బొండపల్లి, డుంబ్రిగుడ మండలం నారింజవలస, మారేడుమిల్లి మండలం గుడిసలో జియో టవర్ల నిర్మాణానికి, అరకులోయ, పెదబయలు, డుంబ్రిగుడ మండలాల్లో పలు చోట్ల రోడ్ల నిర్మాణానికి కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపారు. అలాగే రంపచోడవరం పరిధిలో ప్రతిపాదించిన ఏడు రోడ్లకు, పాడేరులో రెండు రోడ్లకు, హుకుంపేటలో ఎనిమిది రోడ్లకు త్వరితగతిన జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అడ్డతీగల, మారేడుమిల్లిలో జియో టవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని, పర్యాటక ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణం చేపట్టే క్రమంలో పర్యావరణం దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్‌కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, రంపచోడవరం ఐటీడీఏ పీవో కె.సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ వేణుగోపాల్, ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్, పాడేరు, చింతపల్లి డీఎఫ్‌వోలు వెంకటసందీప్‌రెడ్డి, నరసింహులు, అధికారులు పాల్గొన్నారు.

పార్టీ జెండా మోసిన కార్యకర్త సభ్యత్వం తీసుకోవాలి

▸▸ ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ద జ్యోతికిరణ్



పాడేరులో టీడీపీ సభ్యత్వం అందిస్తున్న జ్యోతికిరణ్, తదితరులు

పాడేరురూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకోవాలని ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ద జ్యోతికిరణ్ కోరారు. మూడవ రోజు పాడేరులో సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సభ్యత్వం పొందడం వల్ల పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కె.రాజేష్, ఐటీడీపీ ప్రతినిధులు జి.వెంకటేష్, జి.మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం వంట్లమామిడి గ్రామంలో ఇంటింటికి వెళ్లి పార్టీ కార్యకర్తలతోపాటు యువతీ, యువకులకు సభ్యత్వాలను అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు తోకల ఈశ్వరరావు, ఉప సర్పంచ్ అప్పారావు, పార్టీ నాయకులు కొండబాబు, భువనేశ్వరరావు, అల్లంగి సొంకేసు, కూడా రాజేష్ పాల్గొన్నారు.

మద్దతుదారులందరూ టీడీపీ సభ్యత్వం తీసుకోవాలి

చింతపల్లి: మద్దతుదారులు, అభిమానులు టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. సోమవారం మండలంలోని యర్రబొమ్మలులో టీడీపీ సభ్యత్వాలను పార్టీ మండల అధ్యక్షుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 20వేల సభ్యత్వాలు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సభ్యులందరికీ రూ.ఐదు లక్షల బీమా వర్తిస్తుందన్నారు. భవిష్యత్తులో పార్టీ పదవుల్లో ప్రాధాన్యం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఆంద్రాబు లక్ష్మణ్, నాయకులు రాజుబాబు, సురేశ్, లోవరాజు, ఐటీడీపీ ఇన్‌చార్జి మహేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై క్షేత్ర స్థాయిలో విచారణ

జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్

పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా వైస్ ప్రిన్సిపాల్‌పై చర్యలు

అర్ధ రాత్రి ఆందోళన విరమించిన బాధిత కుటుంబాలు



ఆందోళనకారులతో అర్ధ రాత్రి చర్చిస్తున్న ఎస్పీ అమిత్ బర్ధర్

ముంచంగిపుట్టు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అరకు ఏపీఆర్ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి బి.ప్రవీణ్‌కుమార్ మృతిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపడటామని, పోస్టుమార్టం ఆధారంగా వైస్ ప్రిన్స్‌పాల్‌ను చర్యలు తీసుకుంటామని అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ హామీ ఇచ్చారు. ఎస్‌ఎఫ్ఐ, సీపీఎం, వివిధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు మండల కేంద్రంలో ఆదివారం చేపట్టిన ఆందోళన కార్యక్రమం అర్ధ రాత్రి ఒంటి గంట వరకు సాగింది. మండల స్థాయి అధికారులు, ఎస్ఐలు ఆందోళనకారులతో పలుమార్లు మాట్లాడినా ఫలితం కానరాలేదు. పరిస్థితి ఉధృతంగా మారడంతో జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ హుటాహుటిన అర్ధరాత్రి మండల కేంద్రం చేరుకున్నారు. ఆందోళనకారుల మధ్యలోకి వెళ్లి వారితో పాటు కిందనే కూర్చొని విద్యార్థి కుటుంబ సభ్యులు, బంధువులు, ఆందోళనకారులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా వైస్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. అర్ధ రాత్రి ఆందోళన విరమించారు. ఎస్పీ దగ్గరుండి ప్రవీణ్‌కుమార్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామం పోలిపుట్టుకు పంపించారు. సోమవారం మృతదేహానికి దహన సంస్కరణలు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల శోక సంద్రం నడుమ జరిగాయి.

క్రీడల్లో సత్తా చాటిన ఆశ్రమ విద్యార్థులు



జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చింతపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాజులపాలెం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తాచాటారు. ఆశ్రమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి వంతల సంతోశ్ ఈనెల 23న సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 వాటీబాల్ పోటీల్లో ఉమ్మడి విశాఖపట్నం తరుపున పాల్గొని ద్వితీయ స్థానం సాధించాడు. అలాగే తొమ్మిదో తరగతి విద్యార్థి మర్రి చిట్టిబాబు అనకాపల్లి జిల్లా ఏఎల్ పురంలో జరిగిన అండర్-14 వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, పీడీ జోషప్‌ని ప్రధానోపాధ్యాయులు కె.ప్రసాదరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ నూకేశ్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో సమావేశమైన ఇన్‌చార్జి డీడీ రజని

ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలి: డీడీ రజిని

అరకులోయ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులంతా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) ఎల్.రజని ఆదేశించారు. అరకు పీవీటీజీ గురుకుల బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే గిరిజన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ మృతిపై విచారణ చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో డీడీ మాట్లాడారు. నిబంధనలు అతిక్రమించే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. నాణ్యమైన విద్యనందించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ పీఎస్ఎన్.మూర్తి, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, గురుకుల కళాశాల కన్వీనర్ ప్రిన్సిపాల్ పారయ్య పాల్గొన్నారు. అలాగే గురుకుల సొసైటీ డిప్యూటి సెక్రటరీ సుభాషిణి పీవీటీజీ గురుకుల బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థి మృతిపై విచారణ చేపట్టారు. ఓఎస్‌డీ పీఎస్ఎన్ మూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో బోధనతో విజ్ఞానం

డుంబ్రిగుడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సులువు పద్ధతి బోధనతో చిన్నారుల్లో విజ్ఞానం పెరుగుతుందని సమగ్ర శిక్షణ పాడేరు మానిటరింగ్ అధికారి భాస్కరరావు అన్నారు. మండల కేంద్రంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణలో ఆయన కనిపించారు. చిన్నారుల విజ్ఞానం పెంపకం క్షేత్ర స్థాయిలో సులువు పద్ధతి విద్యాభివృద్ధికి బేస్‌లైన్ శిక్షణ ఉపయోగకరంగా ఉంటుందని, దీన్ని పాఠశాలలో అమలుపరిచి వికాసాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం బాలికల ఆశ్రమ పాఠశాలలోని అదనపు గదులు నిర్మాణాన్ని పరిశీలించారు.

తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి

▸▸ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



బోరింగు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో 23 పంచాయతీల పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని పెద్దాపుట్టు గ్రామంలో సోమవారం నూతన బోరింగు పనులను జడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించిన సమయంలో తన దృష్టికి తాగునీటి సమస్యపై వచ్చిన వినతులను పరిశీలించి, సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నానని చెప్పారు. ప్రస్తుతం 25 గ్రామాలకు సంబంధించి సుమారు 23 బోరింగులు వేసేందుకు గాను సుమారు రూ.30 లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. దశలవారీగా మారుమూల గ్రామాల్లో సైతం తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పెదగూడ పంచాయలోని గలగండ గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, సర్పంచులు సుభాష్, బాబూరావు, గంగాధర్, వైసీపీ నాయకులు జేవీవీస్ మూర్తి, అరబిరు జగబంధు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చండి

▸▸ సమగ్ర శిక్ష అకడమిక్ మానటరింగ్ అధికారి భాస్కరరావు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న భాస్కరరావు

అనంతగిరి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలోనే విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలని సమగ్ర శిక్ష అకడమిక్ మానటరింగ్ అధికారి కొమ్ము భాస్కరరావు సూచించారు. మండలం కేంద్రంలోని బాలికల-1 పాఠశాలలో తరల్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు సామర్థ్యాలను పెంపొందించేందుకు బేస్‌లైన్ పరీక్ష ఉపయోగపడుతుందన్నారు. తెలుగు, గణితం పాఠ్యాంశాల్లో విద్యార్థులు మరింత సామర్థ్యం పొందేలా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా ప్రమాణాలను మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కిల్లో బాలాజీ, సీఆర్పీలు రామకృష్ణ, సునీత, సమూయేలు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే కేసులు

▸▸ ఎస్ఐ వెంకటేశ్వరరావు

చింతపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలో లైసెన్స్ లేకుండా బాణసంచా సామగ్రిని విక్రయిస్తే కేసులు పెడతామని స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, దీపావళి పురస్కరించుకుని మందుగుండు సామగ్రిని విక్రయించే వ్యాపారులు కచ్చితంగా లైసెన్సు తీసుకోవాలన్నారు. లైసెన్సు పొందిన వ్యాపారులు దుకాణాలకు కేటాయించిన స్థలంలో మాత్రమే విక్రయించాలన్నారు. గోదాములకు కూడా అనుమతులు అవసరమన్నారు. అగ్ని ప్రమదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దుకాణాల మధ్య పది మీటర్ల దూరం పాటించాలన్నారు. దుకాణాల వద్ద నీళ్లు, ఇసుక ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నేడు, రేపు సివిల్ సర్వీసెస్ టోర్నీకి ఎంపికలు

పాడేరురూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29, 30వ తేదీలలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నీమెంట్‌కు ఎంపిక ప్రక్రియ జరుగుతుందని జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ చైర్మన్, కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు నవంబరు 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు విజయవాడలో జరిగే పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని సూచించారు. 18 క్రీడాంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 29న తలారిసింగి పాఠశాల క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్యారమ్స్ చెస్, వాలీబాల్, లాన్‌టెన్నిస్, టేబుల్ టెన్నిస్, రెజల్లింగ్, పవర్ అండ్ వెయిట్ లిఫ్టింగ్, ఖో-ఖో, బెస్ట్ ఫిజిక్ అంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. 30వ తేదీన అనకాపల్లి డావిన్సి పాఠశాలలో స్విమ్మింగ్ పోటీలు జరుగుతాయన్నారు. అదేవిధంగా తలారిసింగి పాఠశాల్లో ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, కబడ్డీ, హాకీ, యోగా పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి 9000274225 ఫోన్ నంబరుకు సంప్రదించాలన్నారు.

ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలి

▸▸ వైద్యాధికారి డీకే హిమబిందు



శిశువును పరీక్షిస్తున్న వైద్యాధికారి హిమబిందు

సీలేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలని ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. సోమవారం గుమ్మిరేవుల పంచాయతీ అన్నవరం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 84మందికి ఆరోగ్య తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలన్నారు. పతి గర్భిణి అల్ట్రాసౌండ్ స్కానింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కాగా వైద్య సిబ్బంది రెండు కిలోమీటర్లు కాలినడకన అన్నవరం చేరుకొని వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాణి, ఎంఎల్‌హెచ్‌పీ లోవకుమారి, ఏఎన్ఎంలు మత్స్యకొండ, సీత తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

▸▸ జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు

చింతపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని జనసేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు అన్నారు. సోమవారం స్థానిక గిరిజన భవన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోనూ జనసేన బలపడుతుందన్నారు. వివిధ పార్టీల నుంచి అధిక సంఖ్యలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి తాగునీరు, రహదారులు కల్పించేందుకు డిప్యూటీ సీఎం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తి, గౌరవాధ్యక్షుడు చిన్నరాజబాబు, పార్టీ నాయకులు గాజుల శ్రీను, కారేగి మత్స్యరాజు, వంల రాజుబాబు, సందీప్, దూనబోయిన రమణ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

గూడెంకొత్తవీధి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలన్నారు. సభ్యులకు, అధికారులకు ఆహ్వానాలు పంపించామన్నారు.

మాకవరంలో దారి దోపిడీకి ప్రయత్నం

▸▸ తుపాకులతో సర్పంచ్‌కు బెదిరింపులు

▸▸ మరో వాహన రావడంతో దొంగలు పరారీ

ముంచంగిపుట్టు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాకవరం సమీపంలో సోమవారం రాత్రి దారి దోపిడీ దొంగలు హల్‌చల్ చేశారు. అటుగా వెళ్తున్న మాకవరం పంచాయతీ సర్పంచ్‌ను అడ్డగించి తుపాకులు, కత్తులతో బెదిరించి దోపిడీకి ప్రయత్నించారు. వివరాల్లోకి వెళ్తే... మాకవరం పంచాయతీ సర్పంచ్ గంగాధర్ సోమవారం జోలాపుట్టు పంచాయతీ కేంద్రానికి వెళ్లి పనులు ముగించుకొని మాకవరం వస్తున్నారు. గంగమ్మ తల్లి ఆలయం సమీపంలో ఐదుగురు వ్యక్తులు అతని వాహనాన్ని ఆపారు. కత్తులు, తుపాకీలు చూపించి సర్పంచ్‌ను బెదిరించారు. అతని ద్విచక్ర వాహనంతాళంతో పాటు పర్సు, సెల్ ఫోన్ అడిగారు. దీంతో అతను వాటిని వారికి ఇచ్చేశారు. బైక్ తాళాలు ఇచ్చే సమయంలో ఆ మార్గంలో బొలేరొ వాహనం రావడాన్ని గమనించిన దొంగలు సెల్ ఫోన్‌ను తుప్పల్లో పడేసి, పర్సు పట్టుకొని అక్కడి నుంచి ఒడిశా వైపు కొండ ప్రాంతానికి పరుగులు పెట్టారు. అటుగా వచ్చిన బొలేరొ వాహనంలో ఉన్నవారికి జరిగిన విషయాన్ని సర్పంచ్ తెలిపారు. ఈ సమాచారం పరిసర గ్రామాల ప్రజలు దొంగల కోసం వెతుకుతున్నారు. ఇటీవల వరుస దారి దోపిడీలకు పాల్పడిన దొంగలు కొంత కాలంగా స్తబ్దుగా ఉన్నారు. తాజా సంఘటనతో మండల వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

విస్తృతంగా టీడీపీ సభ్యత్వాల నమోదు

అనంతగిరి, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు అంటిపర్తి బుజ్జిబాబు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును విస్తృతంగా చేయించారు. రూ.5 లక్షల ఇన్సూరెన్స్‌ను సదుపాయం ఉపయోగపడుతుందని, ప్రతీ కార్యకర్తను అండగా పార్టీ ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కొట్యాడ అప్పారావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, కార్యవర్గ సభ్యుడు ఎమ్.జోగులు, నాయకులు బిడ్డ లక్ష్మణ్‌రావు, దయానిధి, దొన్ను, దేముడు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో లిక్కర్ మాఫియా

» ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపణ

అనకాపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):వైసీపీ హయాంలో ప్రభుత్వ పెద్దలు లిక్కర్ వ్యాపారంలో అక్రమాలకు పాల్పడ్డారని, నాణ్యత లేని మద్యం అమ్మకాలు జరిపి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకొన్నారని గనులు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవింద్ర ఆరోపించారు. అనకాపల్లిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మద్యం తయారీ కంపెనీల నుంచి రిటైల్ దుకాణం వరకు తమ గుప్పెట్లో పెట్టుకొని అడ్డగోలుగా దోచుకున్నారని విమర్శించారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం అక్రమాలపై సీఐడీ విచారణ జరుగుతున్నదని, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు వుంటామని చెప్పారు. సొంత చెల్లి ఆస్తినే దోచుకున్న దుర్మార్గుడు జగన్ అని, ఇటువంటి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ప్రజల దురదృష్టమన్నారు.

రాష్ట్రస్థాయి క్యారెమ్స్ పోటీలకు డీపీఎన్ విద్యార్థి


యస్వంత్

కశింకోట, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి క్యారెమ్స్ పోటీలకు ఇక్కడి డీపీఎన్ విద్యార్థి ఎంపికైనట్టు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఆచంట రవి తెలిపారు. విశాఖపట్నం సీతమ్మధారలో గల శారదా విద్యానిలయం హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాల బాలుర క్యారెమ్స్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి ప్రేమబత్తుల యస్వంత్ పాల్గొని అద్భుత ఆట తీరును ప్రదర్శించాడన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని వివరించారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థిని అతనితో పాటు ఉపాధ్యాయులు వి.ప్రభాకర్, ఎం.ఆర్.వి.అప్పారావు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ నక్కా నాగమణి తదితరులు అభినందించారు.

మునిసిపల్ పారిశుధ్య కార్మికులు ధర్నా

» గతంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్

» నాలుగేళ్లుగా యూనిఫాం, చెప్పులు, నూనె, సబ్బులు వంటివి లేవని ఆవేదన


సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట మునిసిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ గతంలో సమ్మె సందర్భంగా పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ సకాలంలో అందకపోవడం వల్ల వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరెండర్ లీవ్‌లు, ప్రమోషన్ స్కేల్ ఇంక్రిమెంట్లు, హెల్త్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. గత నాలుగేళ్లుగా కార్మికులకు యూనిఫాం, చెప్పులు, నూనె, సబ్బులు వంటివి సౌకర్యాలు కూడా కల్పించలేదని పేర్కొన్నారు. నాణ్యత కలిగిన పనిముట్లు లేక కార్మికులు పనిచేసే సమయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. మృతి చెందిన, పదవీ విరమణ పొందిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నిలుపుదల చేసిన మలేరియా కార్మికులను తక్షణమే విధుల్లోకి చేర్చుకోవాలని కోరారు. జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి యర్రంశెట్టి శివప్రసాద్, ఉపాధ్యక్షుడు నిమ్మకాయల అజయ్, పర్మినెంట్ కార్మిక యూనియన్ కార్యదర్శి యర్రంశెట్టి ఓంశివ, గోవింద్, బొమ్మల రాము, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దాం

» సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా


అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అవినీతి రహిత సమాజ స్థాపనకు అంతా కృషి చేద్దామని సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవాలను సోమవారం ప్లాంట్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతికి అంతా దూరంగా ఉండాలన్నారు. వచ్చే నెలమూడో తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయన అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీపీజీ విభాగం సీజీఎం ఫరిదా, సంస్థలోని వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, సీఐఎస్ఎఫ్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు

బాలుర వసతి గృహాన్ని సందర్శించిన డీడీ


గాంధీనగరం హాస్టల్‌లో విద్యార్థులతో డీడీ రాజేశ్వరి

కొత్తూరు, అక్టోబర్ 28 : అనకాపల్లి పట్టణంలోని గాంధీనగరంలో గల ప్రభుత్వ వెనుక బడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని డీడీ రాజేశ్వరి సోమవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ వసతి గృహంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రుచికరమైన భోజనం అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఆమె సూచించారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏబీసీ డబ్ల్యూవో కె.కృష్ణారావు, హెచ్‌డబ్ల్యూవో ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెదురుపర్తి పాఠశాలలో గణిత వారోత్సవాలు



జామెంట్రీ బాక్స్‌లో పరికరాలపై ప్రదర్శన ద్వారా వివరిస్తున్న విద్యార్థులు

కశింకోట, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి) : వెదురుపర్తి ఉన్నత పాఠశాలలో గణిత వారోత్సవాల్లో భాగంగా సోమవారం శకుంతల దేవి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జీవీకే ఆచారి జ్యామితీయ (జామెంట్రీ) బాక్స్‌లోని పరికరాలు, వాటి ఉపయోగాలు తదితరాలను వివరించారు. సమాన భిన్నాలు, స్థూపం, శంఖువ ఘన పరిమాణం వంటి గణిత భావనలను లఘు నాటికల ప్రదర్శన ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. గణిత ఉపాధ్యాయుడు ఏపీఎస్ మూర్తి, పీపీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో గణిత విలువలు పెంపొందించేందుకే వారం రోజులపాటు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బోయిన చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ పార్కుపై క్రీనీడ

» 2018లో నాటి ఎమ్మెల్యే పీలా గోవింద ఆధ్వర్యంలో ఆధునికీకరణ

» అనంతరం వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోని పాలకులు

» ప్రస్తుతం ఎక్కడ చూసినా అసౌకర్యాలు.. అవస్థలు పడుతున్న క్రీడాకారులు


పార్కులోని స్కేటింగ్ గ్రౌండ్


సిమెంటు బెంచీల దుస్థితి


పార్కు ముఖద్వారంలో మూలకు చేరిన గేటు



అనకాపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీనారాయణనగర్‌లో గల స్కేటింగ్ పార్కు అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. ఎక్కడికక్కడ అసౌకర్యాలు తాండవిస్తున్నాయి. పార్కులోకి వెళ్లేందుకు ముఖద్వారం గేటు లేకపోవడంతో రాత్రి వేళల్లో ఆకతాయిల హడావుడి అధికంగా ఉంది. అందులో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వాతావరణాన్ని మరింత పాడుచేస్తున్నారు. 2018వ సంవత్సరానికి ముందు ఇందిరాగాంధీ పేరుతో పార్కు నిర్మాణం చేపట్టారు. దీనిని ఆనుకుని స్కేటింగ్ పార్కు కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. నాడు టీడీపీ అధికారంలోకి ఉండడంతో అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో రెండు పార్కులను ఆధునీకరించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన స్కేటింగ్ పార్కును అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. ఫలితంగా అందులోని నిర్మాణాలు సైతం పాడయ్యాయి. ఇటీవల కాలంలో ఈ పార్కులోకి వెళ్లే ముఖద్వారంలో ఏర్పాటు చేసిన రింగు గేటు సైతం దెబ్బతిని మూలకు చేరింది.

చీకటిపడితే మందుబాబుల సందడి

ప్రస్తుతం పలువురు యువకులు చీకటిపడితే పార్కులో హల్‌చల్ చేస్తున్నారు. ఇందులో కొందరు మద్యం సేవించి హడావుడి చేస్తున్నారు. అంతేకాకుండా ఖాళీ సీసాలను ఆకతాయిన అక్కడే పగలగొడుతున్నారు. దీంతో పార్కుకు వచ్చే పలువురికి ఆ పెంకులు గుచ్చుకుంటున్నాయని అంటున్నారు.

సిమెంటు బెంచీలు ధ్వంసం

పార్కులో చుట్టూ కూర్చొవడానికి ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సుమారు ఎనిమిది బెంచీలు ఇదే పరిస్థితిలో ఉండడంతో స్కేటింగ్ క్రీడకు పిల్లలను తీసుకుని వచ్చే తల్లిదండ్రులు అక్కడ కూర్చోవడానికి అవకాశం లేకుండాపోయింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పార్కును గాలికి వదిలేయడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. దీంతో ఎవరికి వారు పార్కులోకి వచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం స్కేటింగ్ పార్కును అభివృద్ధి చేయాలని క్రీడాకారులంతా కోరుతున్నారు.

ఆకతాయిలకు హెచ్చరించాం : సీఐ

ఇదిలావుంటే, రాత్రి వేళల్లో మందుబాబుల ఆగడాలపై పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, అందిన ముందస్తు సమాచారం మేరకు పలుమార్లు స్కేటింగ్ పార్కులో తనిఖీలు చేశామన్నారు. రెండు దఫాలు మద్యం సేవిస్తున్న యువకులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు మరోసారి ఇలా పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించినట్టు చెప్పారు.

పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

» అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం


అర్జీదారుని సమస్యను ఆలకిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్


ఎస్పీ తుహిన్ సిన్హాకు తన సమస్య చెప్పుకుంటున్న వృద్ధుడు

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారితో స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారు లను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజల సమస్యలు తమ సమస్యలుగా భావించి త్వరగా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కాగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 243 అర్జీలు అందినట్టు కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్‌ఓ దయానిధి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ

అనకాపల్లి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి గోడును ఆలకించారు. మొత్తం 35 అర్జీలు అందగా.. వాటిని సంబంధిత పోలీసు స్టేషన్లకు బదిలీ చేశారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల వినతులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ హుండీ లెక్కింపు

» 123 రోజుల్లో రూ. 52.88 లక్షలు రాక


ఉత్సవ మండలంలో హుండీని లెక్కిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ ఉత్సవ మండపంలో సోమవారం హుండీ లెక్కింపు చేపట్టారు. జూన్ 27 నుంచి ఈనెల 28వ తేదీ వరకు 123 రోజుల్లో భక్తులు సమర్పించిన ముడుపులు, మొక్కుబడుల ద్వారా రూ.52,88,674 ఆదాయం లభించిందని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో ఎన్. సుజాత తెలిపారు. బంగారం 57.400 మిల్లీగ్రాములు, వెండి రెండు కిలోల 200 గ్రాములు వచ్చినట్టు చెప్పారు. దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి పర్యవేక్షణలో జరిగిన హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది, అర్చకులు, శ్రీవారి సేవా సభ్యులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవరపాలెం బ్రాంచ్ సిబ్బంది, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

స్వాములకు అన్నప్రసాదం ప్రారంభం


స్వాములకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న అతిథులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప, భవానీ, శివ, వేంకటేశ్వరస్వామి తదితర మాలలు ధరించిన భక్తులకు స్థానిక కన్యకాపరమేశ్వరి అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం అన్నప్రసాదం కార్యక్రమం ప్రారంభమైంది. డిసెంబరు ఒకటో తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు కటకం లక్ష్మణరావు తెలిపారు. ముత్యాల వెంకటేశ్వరరావు, చింతాడ హేమారావు , భక్తుల సహాయ సహకారాలతో చేపట్టిన ఈ కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బిళ్లపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, అయ్యప్ప ఆలయ కమిటీ కార్యదర్శి వుప్పల శ్రీనివాసరావు, కోశాధికారి పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

'అర్జీలకు పదిహేను రోజుల్లో పరిష్కారం'


గ్రామ సభలో అర్జీని డీటీకి అందిస్తున్న రైతు

సబ్బవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ గ్రామ సభలు పూర్తయిన పదిహేను రోజుల్లో అర్జీలన్నీ పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.గణేశ్ తెలిపారు. బంగారమ్మపాలెంలో సోమవారం నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. భూ సమస్యలను సభల దృష్టికి తేవాల్సిందిగా ఆయన సూచించగా, 44మంది అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వీరయ్య, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, సర్పంచ్ దాడి లావణ్య, ఎంపీటీసీ రాపేటి అరుణ, గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, రాపేటి రాము, సచివాలయ సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రక్తదానం ఆపదలో ఉన్నవారికి ఆయువు

» ఎస్పీ తుహిన్ సిన్హా


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

కశింకోట, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కశింకోటలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ యువత ఇటువంటి మంచి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. అనంతరం వంద మంది యువకులు సుమారు 97 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ముందుగా సీఐ అల్లు స్వామినాయుడు రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ బి.అప్పారావు, సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐలు లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



నెహ్రూచౌక్‌లో నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

తుమ్మపాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఐ నాయకులు సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అనకాపల్లి మెయిన్ రోడ్డులో ర్యాలీ జరిపి, విద్యుత్ చార్జీల పెంపునకు సంబంధించిన ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ ఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరుతో ప్రజలపై రూ.ఆరు వేల 72వేల కోట్ల భారాన్ని మోపడం దారుణమని వాపోయారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.ఎస్.సన్యాసిరావు, రెడ్డిపల్లి అప్పలరాజు, వైఎస్ భద్రం, ఫణేంద్ర, కన్నబాబు, వియ్యపురాజు, కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు డిజిటల్ తరగతులు


మాట్లాడుతున్న కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మూర్తి

సబ్బవరం, అక్టోబరు 28 : ఇంటర్ విద్యను సాంకేతికంగా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగా ఇకపై డిజిటల్ తరగతులను నిర్వ హించనున్నామని సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి తెలిపారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు కళాశాలలో సోమవారం తల్లిదండ్రులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. పిల్లలను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా కళాశాలలకు పంపిస్తూ.. వారి నడవడికపైన కూడా దృష్టి పెట్టాల్సిన బాధ్యత ఉందని సూచించారు. ఈ సమావేశంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎట్టకేలకు కాలువల్లో పూడిక తీశారు..



అనకాపల్లిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ రోడ్లలో గల కాలువల్లో పూడికతీత పనులను జీవీఎంసీ జోనల్ పారిశుధ్య విభాగం సిబ్బంది సోమవారం ఎట్టకేలకు చేపట్టారు. 'వీధులన్నీ కంపు' శీర్షికతో డ్రైనేజీ వ్యవస్థపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు వెనువెంటనే స్పందించారు. పెద్ద కాలువల్లో వాహనాల ద్వారా, చిన్న కాలువల్లో కార్మికులు నేరుగా దిగి పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని పూర్తిస్థాయిలో తొలగిస్తున్నామని శానిటేషన్ సూపర్‌వైజర్ రవి తెలిపారు.

కల్వర్టుపై రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు..



అనకాపల్లి టౌన్ : స్థానిక ఉడ్‌పేటలోని యల్లయ్య కాలువపై కల్వర్టుకు తొలగించిన రక్షణ గోడను ఎట్టకేలకు నిర్మించేలా అధికారులు చర్యలు చేపట్టారు. 'ఏడాదిగా ఇంతే... అధికారులకు పట్టదంతే..' శీర్షికతో ఈనెల 26వ తేదీన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సోమవారం తొలగించిన ప్రదేశంలో రక్షణ గోడ పునర్నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ప్రమాదాల భయం తప్పిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని వినతి

పరవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రను సోమవారం విశాఖపట్నంలోని విమానాశ్రయంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు కలిశారు. పెద్ద సంఖ్యలో మత్స్యకారులతో కలిసి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించారు. సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మాసిటీలలో మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మపాలెం, తిక్కవాని పాలెం సర్పంచ్‌లు చింతకాయల సుజాత, చేపల మసేను, మత్స్యకార నాయకులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.